క్లుప్తంగా

కేసు నమోదు

చింతకాని: మండలంలోని నేరడ గ్రామానికి చెందిన మట్టా సీతారాములుపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాములు తన కుమార్తె రజినిని గత నాలుగేళ్ల క్రితం కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామానికి చెందిన పెద్దగొండ్ల గోపాలరావుకు ఇచ్చి వివాహం చేశాడు. భార్యభర్తల మధ్య గొడవలు రాగా.. 4నెలల క్రితం రజిని తన కుమారుడుని తీసుకుని పుట్టింటికి వచ్చింది. శుక్రవారం కుమారుడిని చూసేందుకు వచ్చిన గోపాలరావును మామ సీతారాములు అసభ్య పదజాలంతో దూషిస్తూ ఇనుప రాడ్డుతో తల, చేయి, మెడ, కాలుపై కొట్టడంతో తీవ్ర గాయాలైనాయి. దీంతో గోపాలరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

బోనకల్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ముష్టికుంట్ల ఉన్నత పాఠశాలలో గ్రామస్తుడు వాసిరెడ్డి మోహన్‌రావు.. తండ్రి వాసిరెడ్డి పిచ్చియ్య వర్ధంతి సందర్భంగా వితరణ చేసిన నోట్ పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తుడైన మున్సిపల్ కమిషనర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, కాంగ్రెస్, సీపీఎం, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నిందితుడిని శిక్షించాలి

కారేపల్లి: 11ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని మండల ఐద్వా అధ్యక్ష , కార్యదర్శులు సూరబాక ధనమ్మ, కె.ఉమావతిలు డిమాండ్ చేశారు. ఆదివారం కారేపల్లిలో జరిగిన ఐద్వా మండల స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఐద్వా నాయకురాళ్లు కరపటి సీతమ్మ, వరలక్ష్మి, మేకల స్వరుపరాణి, శారద తదితరులు పాల్గొన్నారు.

రైతు నేస్తం కార్యక్రమానికి హాజరుకావాలి



ఏఓ బి.అశోక్‌కుమార్

ఎర్రుపాలెం/కారేపల్లి: ఈ నెల 16న సాయంత్రం 3గంటలకు మండలంలోని అన్ని రైతు వేదిక కార్యాలయాల్లో నిర్వహించనున్న రైతు నేస్తం సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లకు స్థానిక రైతులు హాజరై సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వినాలని ఎర్రుపాలెం, కారేపల్లి మండల వ్యవసాయాధికారులు బోయినపల్లి సాయిశివ, బి.అశోక్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు.

నోట్ పుస్తకాలు పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న మాజీ ఎంపీపీ శ్రీనివాసరావు

తల్లాడ: మండలంలోని నారాయణపురం కారుణ్య సొసైటీ సర్వీస్ ఆధ్వర్యంలో ఆదివారం పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ శ్రీనివాసరావు ప్రారంభించి.. ఆయన చేతుల మీదుగా విద్యార్థులకు నోట్‌పుస్తకాలతో పాటు పెన్సిళ్లు, జామెంట్రీ బాక్స్‌లు, స్కూల్ డిక్షనరీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కారుణ్య సోషల్ సర్వీస్ అధ్యక్షుడు బాలరెడ్డి కుటుంబాన్ని సన్మానించారు. కార్యక్రమంలో వీరమోహన్‌రెడ్డి, డి.వెంకట్‌లాల్, జీవీఆర్, కృష్ణ, లూర్ధుమాతా సిస్టర్ ప్రసన్న, సంతోష్, జోజి, అంకంరాజు, నరసింహారావు, కృష్ణమ్మ పాల్గొన్నారు.

విమాన ప్రమాద మృతులకు నివాళి

మధిర: అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించిన వారికి మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు జంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. విమాన ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు టాటా కంపెనీతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నర్సింహారావు, కృష్ణారావు, ప్రసాదరావు, శ్రీధర్, శ్రీనివాసరెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



తెల్లపాలెం చెరువుకు గండిపడిన దృశ్యం



చెరువు కింద సాగయ్యే ఆయకట్టు భూములు

రైతులకు మిగిలేది కడ 'గండ్లే'నా?

- చెరువుకు నాలుగు చోట్ల గండ్లు
- పట్టించుకోని అధికారులు
- ఆవేదనలో అన్నదాతలు
- నిధులు మంజూరైనా పనులు చేపట్టని ఇరిగేషన్ అధికారులు



మరమ్మతుకు గురైన చెరువు తూము

ఎర్రుపాలెం: గతేడాది కురిసిన భారీ వర్షాలకు మండలంలోని తెల్లపాలెం చెరువుకి నాలుగు చోట్ల భారీగా గండ్లు పడ్డాయి. వరద దాటికి తూములు సైతం పూర్తిగా మరమ్మతులకు గురైంది. ఈ చెరువు కింద దాదాపు 150 ఎకరాల మేరకు వరిపంట సాగవుతుంది. గండ్లు పడిన సమయంలో చెరువు నుంచి పారిన వరదకు వరి పైర్లు కొట్టుకుపోయాయి.

నిధులు మంజూరు అయినా..

చెరువు గండ్ల మరమ్మతులకై ప్రభుత్వం రూ.14 లక్షల నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నప్పటికీ గండ్లు పూడ్చకపోవడంతో చెరువులో ఒక్క చుక్క కూడా నీరు నిల్వ లేకుండా పోయింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా.. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో నేటికీ ఆ గండ్లకు మరమ్మతులు చేపట్టలేదు. దీంతో తెల్లపాలెం, ఎర్రుపాలెం, పెగళ్లపాడు గ్రామాలకు చెందిన ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

పంట సాగు చేయలేం..



చెరువుకు పడిన గండ్లు పూడ్చకపోతే ఈ ఏడాది కూడా పంట సాగు చేయలేం. చెరువు ఆయకట్టు కింద ఎకరన్నర పొలం ఉంది. గతేడాది వేసిన వరిపంట చెరువుకు గండ్లు పడి కట్ట తెగిపోవడంతో పూర్తిగా కొట్టుకుపోయింది. దాదాపు రూ.30 వేల వరకు పంటనష్టం వాటిల్లింది. ఈసారైనా అధికారులు మరమ్మతులు చేస్తారనుకుంటే చేయలేదు.

– షేక్.మౌలానా, రైతు, తెల్లపాలెం

పది కుంటల భూమి ఉంది..



మాకు చెరువు కింద 10 కుంటల భూమి ఉంది. ప్రతి ఏటా వరిసాగు చేస్తే తిండి గింజలు వస్తాయి. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు చెరువుకు పడిన గండ్లు నేటికీ పూడ్చలేదు. దీంతో వర్షాలు కురిసినప్పటికీ చెరువులోకి నీరు రాలేదు. సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా అధికారులు గండ్లు పూడ్చటంలో తాత్సారం వీడాలి.

– కుర్రా నాగరాజు, రైతు, తెల్లపాలెం

చర్యలు తీసుకుంటాం..



చెరువు గండ్లు పూడ్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన మాట నిజమే. మండలంలోని భీమవరం, బుచ్చిరెడ్డిపాలెం, బనిగండ్లపాడు గ్రామాల్లోని చెరువుల మరమ్మతులు కొనసాగుతున్నాయి. ఆ పనులు పూర్తికాగానే తెల్లపాలెం చెరువు గండ్లు పూడ్చివేత, తూముల మరమ్మతులను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– టి.సాంబశివరావు, డీఈ, ఇరిగేషన్ శాఖ, ఎర్రుపాలెం

వైద్య శిబిరం విజయవంతం



మందులు అందిస్తున్న వైద్యాధికారులు

వైరా: వైరాలోని బోడేపూడి కళానిలయం వారి ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరం ఆదివారం విజయవంతమైంది. ఈ శిబిరంలో రోగులు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఈ సందర్భంగా బోడేపూడి కళానిలయం కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ.. వైద్యశిబిరం ప్రజల్లో మంచి నమ్మకంతో పది వసంతాలు పూర్తిచేసుకుందన్నారు. కార్యక్రమంలో చింతనిప్పు చలపతిరావు, బొంతు సమత, రజిని, చలపతిరావు, శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరావు, రామారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడేది ఎర్రజెండానే



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

తల్లాడ: పేద ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడేది ఎర్రజెండానేనని సీపీఎం రాష్ట్ర నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని కుర్నవల్లిలో సత్తుపల్లి డివిజన్‌స్థాయి రాజకీయ శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న రోజుల్లో కేంద్రం ప్రభుత్వంపై జరిగే పోరాటాల్లో ప్రజలందరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాచర్ల భారతి, నాయకులు కొండల్‌రావు, సత్యనారాయణరెడ్డి, రమేష్, భాస్కర్‌రావు, పాండురంగారావు, విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

ఎర్రుపాలెం: బీజేపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింతగా కృషి చేయాలని పార్టీ జిల్లా కమిటీ అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని మీనవోలు గ్రామంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రధానిగా మోదీ 11వసంతాలు పూర్తైన సందర్భంగా మండలాల్లో సంకల్ప సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సంకల్ప సభల కరపత్రాలను ఆవిష్కరించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణా రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు కొమ్మినేని కృష్ణారావు, నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు నూతక్కి నర్సింహారావు, నాయకులు తదితరులున్నారు.

సైనిక్ స్కూల్‌లో సీటు సాధించిన విద్యార్థి



చరణ్ జీత్

మధిర: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన తెలంగాణ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో 334వ ర్యాంక్ సాధించి కరీంనగర్ జిల్లా రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌లో మధిరకు చెందిన చరణ్ జీత్ సీటు సాధించాడు. రాష్ట్ర వ్యాప్తంగా టీ సెట్‌లో 35వేల మంది విద్యార్థులు పరీక్ష రాయగా 800మంది అర్హత సాధించారు. సైనిక్ స్కూల్‌లో 80 సీట్లకు 1:10 నిష్పత్తిలో నిర్వహించిన మెడికల్, ఫిజికల్ టెస్ట్‌లో ప్రతిభను చాటిన చరణ్ జీత్ ఎంపికయ్యారు. దీంతో విద్యార్థిని పలువురు అభినందించారు.

చిన్నారుల చేరికలే లక్ష్యంగా..

- అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట
- అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతమే లక్ష్యం



అంగన్‌వాడీ బడిబాటలో అధికారులు, చిన్నారుల తల్లిదండ్రులు (ఫైల్)

సత్తుపల్లిటౌన్: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించింది. పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్న ఈ కేంద్రాలకు చిన్నారుల ప్రవేశాలను పెంచేందుకు 'అమ్మ మాట – అంగన్‌వాడీ బాట' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోంది.

17వరకు అవగాహన కార్యక్రమాలు..

ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు ప్రభుత్వం జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ చేపట్టింది. ఆట, పాటలతో కూడిన దృశ్య, శ్రవణ పద్ధతుల్లో బోధన అందిస్తూ చిన్నారులు పూర్వ ప్రాథమిక విద్యపై పట్టు సాధించేలా చర్యలు చేపట్టారు. ఇందుకు అవసరమైన ఆట వస్తువులను ప్రభుత్వం సమకూర్చింది. అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చి కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం సంకల్పించింది.

చేయాల్సిన పనులు..

- అంగన్‌వాడీ టీచర్లు మూడేళ్ల వయస్సు ఉన్న పిల్లలను గుర్తించి వారి ఇళ్లను సందర్శించాలి
- ఉపాధ్యాయులు, వివిధ సంఘాలు, పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి ర్యాలీలు
- క్షేత్రస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశాలు
- స్వచ్ఛ అంగన్‌వాడీ కార్యక్రమం పేరుతో కేంద్రాల్లో చెత్త, ఇతర వ్యర్థాలను తొలగించి శుభ్రం చేయటం
- రెండేళ్లలోపు చిన్నారులను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేలా వారి తల్లిదండ్రులకు వివరించటం.
- తాగునీరు, టాయిలెట్స్ వినియోగంలోకి వచ్చేలా చర్యలు, కేంద్రాలు, పరిసరాల్లో మొక్కలు నాటడం
- సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహణ, చిన్నారులకు పాఠాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, టైంటేబుల్, అంశాలపై అవగాహన కల్పించటం

సద్వినియోగం చేసుకోవాలి..



అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి. పిల్లలు కేంద్రాల్లో ప్రవేశాల కోసం ఈ నెల 17వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. అందరు భాగస్వామ్యులై విజయవంతం చేయాలి.

– కె.రాంగోపాల్‌రెడ్డి, డీడబ్ల్యూఓ, ఖమ్మం

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వైరా: వైరాలోని శ్రీనికేతన్ విద్యాలయంలో 2004–05 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. అలనాటి ప్రిన్సిపాల్ వేణుగోపాలరావు, ఉపాధ్యాయులు హాజరై విద్యార్థులతో గత 20 ఏళ్ల అనుభవాలను పంచుకున్నారు. అనంతరం గురువులను సత్కరించారు. నూతన కమిటీని ఎన్నుకొని.. వారి తరుపున పాఠశాలకు సాయం చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కుదురుపాక సతీష్, గొల్లమందల బాబు, కల్యాణ్, ఫణీందర్, ధరావత్ వెంకటేశ్వర్లు, స్వాతి, శైలజ, పుష్ప, సైదులు, రామకృష్ణ, అనంతరాములు తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రామిరెడ్డికి పురస్కారం



రైతు వెంకట్రామిరెడ్డిని సత్కరిస్తున్న నిర్వాహకులు

ఎర్రుపాలెం: మండలంలోని కుదుముల వెంకట్రామిరెడ్డికి మండలకేంద్రంలో వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ మండల కమిటీ నిర్వాహకులు సేంద్రియ ఉత్తమ రైతు పురస్కారాన్ని అందజేశారు. శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రకృతిలో భూమి, నీరు, గాలి విష రసాయనాలతో కలుషితం చేయకుండా ఆరోగ్యమైన దేశవాళీ విత్తనాలతో పంటలు పండిస్తున్న వెంకటరామిరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సింధు, కొప్పు పరమేశ్వరరావు, దూపగుంట్ల అప్పారావు, దూపగుంట్ల రమా కుమారి, సంధ్య తదితరులున్నారు.

ముగిసిన వేసవి శిక్షణా శిబిరం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న నాయకులు, ఎస్‌ఐ

వైరా: స్థానిక బాలికోన్నత పాఠశాలలో గత 40 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి కరాటే శిక్షణా శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా చిన్నారులు గత 40 రోజులుగా తాము నేర్చుకున్న కరాటే ప్రదర్శన చేశారు. టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు వైరా ఎస్‌ఐ పి.రామారావు లు ముఖ్య అతిథులుగా హాజరై సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. కరాటే మాస్టర్ సైదులు, సురేష్, దినేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

యువత పెడదోవ పట్టొద్దు..



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రామారావు

వైరా: యువత గంజాయి గుట్కా వంటి మాదక ద్రవ్యాలు వంటి వాటికి అలవాటు పడి పెడదోవ పట్టొద్దని.. ఎస్‌ఐ పుష్పాల రామారావు అన్నారు. ఆదివారం వైరాలోని బ్రాహ్మణపల్లి, శాంతినగర్, తాటిపూడి, గండగలపాడు గ్రామాల్లోని యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిసలై కుటుంబాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి అమ్మకాలు చేసే వారు , సేవించే వారి వివరాలు పోలీసులకు తెలియజేయాలన్నారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



రొట్టమాకురేవు గ్రామంలో బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

కారేపల్లి: వానలు కురవాలని, పాడిపంటలు సంమృద్ధిగా పండాలని కోరుతూ.. మండల పరిధిలోని రొట్టమాకురేవు గ్రామంలో ఆదివాసీలు ఆదివారం గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో కొలువు తీరిన బొడ్రాయి, ముత్యాలమ్మతల్లి, శ్రీప్రసన్నాంజనేయస్వామి విగ్రహాలకు జలాభిషేకాలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు చుంచు లక్ష్మి, చీమల కౌసల్య, చింత వెంకటమ్మ, ఇరుప గురవమ్మ, కుంజ రాధమ్మ, ఉడుగు కళావతి, పాడెం చంద్రిక, చింత రాధ తదితరులు పాల్గొన్నారు.

90రోజులుగా కొనసాగుతున్న మజ్జిగ పంపిణీ



కల్లూరు బస్టాండ్‌లో ప్రయాణికులకు ఉచితంగా పంపిణీ చేస్తున్న మజ్జిగ

కల్లూరు: కల్లూరు బస్టాండ్‌లో తాగునీటితో పాటు వేసవిలో ఉచిత మజ్జిగ పంపిణీ చేయడం సంతోషంగా ఉందని సత్తుపల్లి డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి అన్నారు. నాలుగేళ్లుగా వేసవిలో ఉచిత మజ్జిగ పంపిణీకి సహకరిస్తున్న దాతలను అభినందించారు. ఆర్టీసీ అధికారుల ప్రోత్సాహంతో విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనంద్ కృషితో ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం సోమవారానికి 90రోజులు పూర్తి చేసుకుంది. రీజియన్‌లోనే ఏ డిపోలో లేని విధంగా వీబీఓ ఆనంద్ కృషి చేసాడు. అనంతరం వీబీఓ కిన్నెర ఆనంద్ మాట్లాడుతూ.. ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది దాహార్తిని తీర్చాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని, ప్రారంభంలో కొంచెం కష్టపడాల్సి వచ్చినా తర్వాత దాతలే ఫోన్ చేసేటట్లు ప్రోత్సహించామని, డిపో మేనేజర్ చొరవ, కృషితో కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నామని తెలిపారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రోత్సాహకం



బహుమతులు అందిస్తున్న సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ జె.గోపాలరావు

సత్తుపల్లి: విద్యార్థులకు ప్రోత్సాహకం అందించటం మరింత ఉత్సాహాన్ని అందిస్తుందని సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ జె.గోపాలరావు అన్నారు. సత్తుపల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదిలో అత్యధిక మార్కులు విద్యార్థులకు ఆదివారం ప్రాఫిట్ షూకంపెనీ ప్రోత్సాహకాలు అందించారు. మండలంలో ప్రథమ స్థానం సాధించిన కొనకళ్ల ధనదుర్గ (కాకర్లపల్లి), ద్వితీయ స్థానం సాధించిన పంతంగి లక్ష్మీప్రసన్నకు ప్రాఫిట్ షూకంపెనీ ప్రశంసాపత్రం, మెమోంటోలతో పాటు షూ, కళాశాల బ్యాగ్‌లను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో ఏపీపీ జె.ప్రదీప్, న్యాయవాది నల్లగట్ల విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, ప్రాఫిట్ షూ కంపెనీ నిర్వాహకులు పాల్గొన్నారు.

చదువుల తల్లి లావణ్యకు చేయూత



లావణ్యకు నగదు అందిస్తున్న దాతలు

మధిర: మండలంలోని ఖమ్మంపాడు గ్రామానికి చెందిన సామినేని లావణ్య ఉన్నత చదువుల నిమిత్తం చేడే శ్రీనివాసరావు మిత్రబృందం ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. లావణ్య ప్రస్తుతం వైజాగ్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ 4వ సంవత్సరం చదువుతుంది. ఆమె నిరుపేద కుటుంబం కావడంతో ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు సాయమందించి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాడు. దీంతో సాయమందించిన దాతలకు లావణ్య తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కర్నాటి వెంకటేశ్వరరావు, కోట జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి

కొణిజర్ల: రజకుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 17న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రజకవృత్తి దారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నారపు వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.



ఎర్రుపాలెం: కేక్ కట్ చేస్తున్న మండల కమిటీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు

ఘనంగా భట్టి జన్మదిన వేడుకలు

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు ఆదివారం గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయాల్లో, పలు సెంటర్లలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేయడంతో పాటు భట్టికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భట్టి అభిమానులు వృద్ధాశ్రమాల్లో పండ్లు పంపిణీ, తలసేమీయా పిల్లల కోసం రక్తదానం చేయడంతో పాటు పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



మధిర: భట్టివిక్రమార్క జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ముదిగొండ: ప్రధాన సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న నాయకులు



బోనకల్: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



సత్తుపల్లిలో కేకట్ చేస్తున్న మట్టా దయానంద్



వైరాలో..